సాక్షి అనంతపురం

ఆదివారం ၊ 9 ၊ మార్చి ၊ 2025




చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

టీటీసీ పరీక్ష ఫలితాల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ)–2024 థియరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. www. bse.ap. gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణత సర్టిఫికెట్లు జిల్లా కార్యాలయానికి చేరగానే అభ్యర్థులకు పత్రికల ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.

5,847 కేసుల పరిష్కారం



కక్షిదారులకు స్వయంగా భోజనం వడ్డిస్తున్న న్యాయమూర్తి జి. శ్రీనివాస్

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన 'జాతీయ మెగా లోక్ అదాలత్'లో 5,847 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మొత్తం 24 బెంచ్‌లు నిర్వహించారు. బాధితులు రాజీకి సమ్మతించడంతో 886 క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు 80, మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు 48, ప్రీ లిటిగేషన్ కేసులు 388 పరిష్కారమయ్యాయి. ప్రమాద కేసుల్లో బాధితులకు రూ.3.83 కోట్లు పరిహారంగా అందించారు. సివిల్ కేసుల్లో రూ.2.82 కోట్లు, ప్రీ లిటిగేషన్ కేసుల్లో రూ.68 లక్షలు రాజీ ప్రకారం బాధితులకు ఇప్పించారు. లోక్‌అదాలత్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. శివప్రసాద్ యాదవ్ పర్యవేక్షించారు. జిల్లా కోర్టులో కక్షిదారులకు న్యాయమూర్తి జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

కిరికెర సర్పంచ్‌కు ఉత్తమ పురస్కారం



కేంద్ర గ్రామీణ కమిషనర్ నుంచి పురస్కారాన్ని అందుకున్న సర్పంచ్ వైఎన్ భాగ్యమ్మ

హిందూపురం: పంచాయతీ స్వశక్తి అదినేత్రి ఉత్తమ పురస్కారాన్ని హిందూపురం మండలం కిరికెర పంచాయతీ సర్పంచ్ వైఎన్ భాగ్యమ్మ అందుకున్నారు. ఢిల్లీలో 5,6 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి రాష్ట్రం నుంచి ఆరుగురు మహిళా ప్రజాప్రతినిధులను ఎంపిక చేశారు. అందులో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి కిరికెర సర్పంచ్ భాగ్యమ్మ ఉన్నారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆమె మహిళా సాధికారత, ఫ్రెండ్లీ ఉమెన్, గ్రామ పంచాయతీల అభివృద్ధి గురించి క్లుప్తంగా ప్రసంగించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. దీంతో ఆమెను ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశారు. అనంతరం సర్పంచ్ భాగ్యమ్మకు కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమిషనర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా 'పంచాయతీ స్వశక్తి అదినేత్రి పురస్కారం'తో పాటు జాతీయ ఉత్తమ ప్రశంసా పత్రం, షీల్డ్ అందించి అభినందించారు.

ఖాద్రీ లక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె..



కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేయనున్నారు. బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ ఘట్టానికి విశేష ప్రాధాన్యముంది. నవ ధాన్యాలు మొలకెత్తడాన్ని అంకురార్పణ అంటారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామివారి ఆశీస్సులు పొందటమే అంకురార్పణ ఘట్ట ముఖ్య ఉద్దేశం. సూర్యుడు అస్తమించిన తర్వాతే అంటే రాత్రి సమయంలో ఈ అంకురార్పణ ఘట్టం నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిర్వహించే అంకురార్పణ ఘట్టంలో అగ్నిహోమం ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే సకల దేవతలను ఆహ్వానిస్తారు.

నవధాన్యాల మొలక

సకల దేవతల ఆహ్వానం అనంతరం భూమాతను ప్రార్థిస్తూ పాలిక (కొత్తకుండ) లను మట్టితో నింపుతారు. ఈ పాలికలకు నూతన వస్త్రాన్ని అలంకరించి పుణ్యాహవచనం గావిస్తారు. అనంతరం అర్చక పండితులు సోమరాజ మంత్రం, వరుణ మంత్రం, విష్ణుసూక్తం పఠిస్తారు.

హామీ ఇచ్చారు..
టోపీ పెట్టారు!



- ఉమ్మడి అనంత జిల్లాకు ఎమ్మెల్సీ పదవి లేనట్టే
- కనీసం రేసులో కూడా లేని నాయకులు
- 14 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చినా దిక్కు లేని పరిస్థితి
- ఎన్నికల ముందు మాట ఇచ్చి నేడు పట్టించుకోలేదని నేతల నిట్టూర్పు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ నాయకుల పరిస్థితి దారుణంగా ఉంది. నాలుగు ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అవుతున్న నేపథ్యంలో ఒక్కటి కూడా ఉమ్మడి జిల్లా నేతలకు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అధిష్టానం వద్ద ఇక్కడి నాయకుల పేర్లు కనీసం ప్రస్తావనకు కూడా రాలేదని తెలిసింది. దీంతో 'తెలుగుతమ్ముళ్ల'లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. పార్టీకి కష్టపడి పనిచేసినా ఫలితం లేదని, మొత్తం సీట్లన్నీ గెలిచినా ఎమ్మెల్సీ భాగ్యం మాత్రం జిల్లాకు దక్కే పరిస్థితి లేకపోవడం దారుణమని వాపోతున్నారు.

ఆశావహుల్లో నిరాశ..

కూటమి సర్కారు కొలువుదీరి తొమ్మిది నెలలు పూర్తి కావస్తోంది. 2024లో జరిగిన ఎన్నికల్లో పాతవారిని కాదని కొత్తవారికి టికెట్లు ఇచ్చారు. ఆ సందర్భంగా పాతవారికి ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడేమో ప్లేటు ఫిరాయించినట్టు నేతలు చెబుతున్నారు. అప్పట్లో అనంతపురం అర్బన్ సీటు ప్రభాకర్ చౌదరి వదులుకోవాల్సి వచ్చింది. గుంతకల్లు సీటును జితేందర్‌గౌడ్ వదులుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు డాక్టర్ సునీల్‌కుమార్‌కు అసెంబ్లీ టికెట్ ప్రకటించి, ఆ తర్వాత రద్దు చేశారు. కార్పొరేషన్ చైర్మన్ లేదా ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలో నిమ్మల కిష్టప్ప, పల్లె రఘునాథరెడ్డి, గుండుమల తిప్పేస్వామి ఇలా ఎందరో ఆశావహులు ఉన్నారు. కానీ వీళ్ల పేరు ఎక్కడా కనీసం ప్రస్తావనకు కూడా రాకపోవడంతో తీవ్ర నిరాశలో కూరుకుపోయినట్లు తెలిసింది.

సామాజిక సమీకరణలు కుదరలేదట..!

ఉమ్మడి జిల్లాకు ఎమ్మెల్సీ సీటు కేటాయించకపోవడానికి సామాజిక సమీకరణాలు కుదరడం లేదని చెబుతున్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన ప్రభాకర్ చౌదరికి ఇవ్వాలంటే.. మైలవరం నుంచి దేవినేని ఉమా మహేశ్వరరావు పోటీలో ఉన్నారు. ఇక రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చే అవకాశం లేదు. బీసీ, ఎస్సీలకు ఇచ్చేందుకు కూడా ఇతర జిల్లాలనుంచి తీవ్ర పోటీ ఉందని, అందుకే ఈ దఫా ఉమ్మడి జిల్లాకు ఇవ్వలేమని చెబుతున్నారని కొంత మంది టీడీపీ నేతలు వాపోతున్నారు.

లోకేష్ ఒప్పుకుంటేనే పదవి..

మంత్రి లోకేష్ కనుసన్నల్లో ఉన్నవారికే ఎమ్మెల్సీ పదవి దక్కుతుందని పార్టీలో ఎవరినడిగినా చెబుతున్నారు. ప్రభాకర్‌చౌదరికి లోకేష్ వద్ద పెద్దగా పలుకుబడి లేదు. మిగతా నాయకులకూ అంతంత మాత్రమే. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు లోకేష్ వద్ద అంతో ఇంతో పలుకుబడి ఉన్నా.. ఆయన ఎవరినీ సిఫార్సు చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఉమ్మడి అనంత జిల్లాలో 14 ఎమ్మెల్యే సీట్లు గెలిపించినా ఒక్క ఎమ్మెల్సీ కూడా ఇవ్వలేకపోవడం దారుణమని కేడర్‌లో అసంతృప్తి ఉంది.

నేడు చంద్రమౌళీశ్వరుని బ్రహ్మ రథోత్సవం



శనివారం రాత్రి బసవేశ్వర వాహనంపై ఊరేగుతున్న చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి బ్రహ్మ రథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరగనుంది. ఇప్పటికే గవిమఠం సహాయ కమిషనర్ కె.రాణి ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీరు, నిత్యాన్నదాన సేవ, తాత్కాలిక మరుగుదొడ్లతో పాటు గవిమఠం ఆవరణలో పోలీసు కంట్రోల్ రూం, ఉరవకొండ సీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రథోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్పెషల్ పార్టీ బలగాలు బందోబస్తు చేపట్టనున్నాయి. ఉత్సవాన్ని తిలకించడానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి చంద్రమౌళీశ్వర స్వామి బసవేశ్వర వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

మహిళాభ్యున్నతికి జగన్ పెద్దపీట



పార్టీ నాయకురాళ్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: మహిళాభ్యున్నతికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన 'అనంత'.. ముందుగా దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఐదేళ్ల కాలంలో ఏకంగా రూ.1,89,519 కోట్లను నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేశారన్నారు. రూ.25,571 కోట్ల డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేశారన్నారు. సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేసి ఏకంగా రూ.4,969.04 కోట్లను అందించారన్నారు. కూటమి ప్రభుత్వంలో సున్నా వడ్డీ పథకానికి తిలోదకాలిచ్చారని విమర్శించారు. 'తల్లికి వందనం' పథకానికి ఎగనామం పెట్టారన్నారు. మహిళల రక్షణ, భద్రత కోసం తెచ్చిన 'దిశ'ను కూడా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఎప్పుడు సీఎంగా ఉన్నా మహిళాభ్యున్నతి, మహిళల రక్షణ అనేవి మేడిపండు చందంగా ఉంటాయని ఎద్దేవా చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ మహిళలను నిర్లక్ష్యం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు. గత ప్రభుత్వంలో మహిళలకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్. కృష్ణవేణి, జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు యాడికి లక్ష్మిదేవి, మహిళా విభాగం నాయకులు ఆశాబీ, పార్వతి, సాకే చంద్రలేఖ, నాగలక్ష్మి, ఉష, ప్రసన్న, శోభాబాయి, శోభారాణి, దేవి, సంధ్యారాణి, విశాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశ పురోగతి



జేఎన్‌టీయూలో జరిగిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎంపీ అంబికా, ఎమ్మెల్యేలు సునీత, శ్రావణి



జిల్లా కోర్టులో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్, చిత్రంలో కలెక్టర్, జడ్జిలు, తదితరులు

అనంతపురం: మహిళా సాధికారతతోనే దేశ పురోగతి సాధ్యమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం జేఎన్‌టీయూ(ఏ) ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, అసిస్టెంట్ కలెక్టర్ బి. వినూత్న, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుశీలమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలపై నేరాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.జిల్లాలో బాల్య వివాహాలు సమస్యగా తయారయ్యాయన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ బి. వినూత్న జిల్లాలో బాగా పనిచేశారని, న్యూఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేసేందుకు వెళ్తున్నారని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ తన భర్త ప్రోత్సాహంతోనే అందరి ముందు ఉన్నానని పేర్కొన్నారు.అనంతరం ఐసీడీఎస్, సెర్ప్, మెప్మా, పోలీసు, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు పరిశీలించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ప్రశాంతి సమాఖ్య, స్త్రీనిధి, పరిశ్రమల శాఖ పరిధిలో పీఎంఈజీపీ కింద ఎంఎస్ఎంఈ రుణాలు, పీఎం విశ్వకర్మ, స్టాండప్ ఇండియా, 'ముద్ర', హ్యాండ్‌లూం, టెక్స్‌టైల్స్, మెప్మా పరిధిలో రుణాల చెక్‌లను మహిళలకు అందజేశారు.

సమానత్వంతోనే జాతి మనుగడ

అనంతపురం: జాతి మనుగడకు స్త్రీ, పురుష సమానత్వం ముఖ్యమని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ అన్నారు. జిల్లా కోర్టులో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా జడ్జి శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి శ్రీనివాస్ మాట్లాడుతూ భూదేవికి ఉన్నంత ఓర్పు, సహనం మహిళలకు ఉంటుందన్నారు. మహిళల ప్రాధాన్యతను వివరించారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. మహిళలకు జిల్లా యంత్రాంగం సహకారం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ కంటి ఆసుపత్రి, అక్బర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 300 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవాణి, బార్ ప్రెసిడెంట్ గురుప్రసాద్,ఆలిండియా బార్ కౌన్సిల్ మెంబర్ ఆలూరి రామిరెడ్డి, మహిళా కోర్టు జడ్జి శోభారాణి, పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి, సీనియర్ సివిల్ జడ్జి నిర్మల, ఎక్సైజ్ కోర్టు జడ్జి పావని పాల్గొన్నారు.

అయినా.. అట్టడుగునే!



- అమ్మాయిల సంఖ్యలో చివరి స్థానంలో 'ఉమ్మడి అనంత'
- ప్రతి వెయ్యిమంది అబ్బాయిలకు 977 మందే అమ్మాయిలు
- సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి

ఉమ్మడి జిల్లాలో ప్రతి వెయ్యిమంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య

సంవత్సరం	సంఖ్య	సంవత్సరం	సంఖ్య
1961	946	1971	947
1981	946	1991	946
2001	958	2011	977

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఐఐటీల్లో సీట్లు సాధిస్తున్నా.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా రాణిస్తున్నా.. జనాల పరంగా మాత్రం అమ్మాయిలు ఇంకా వెనుకబడే ఉన్నారు. 30 ఏళ్లుగా ఇదే దుస్థితి కొనసాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గడిచిన ఐదు దశాబ్దాల్లో ఒక్కసారైనా అబ్బాయిల కంటే అమ్మాయిల సంఖ్య పెరగలేదు. తాజా సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం అమ్మాయిల సంఖ్యా పరంగా ఇప్పటికీ ఉమ్మడి అనంతపురం జిల్లా అట్టడుగున ఉన్నట్లు వెల్లడైంది.

యథేచ్ఛగా లింగనిర్ధారణ..

ఉమ్మడి జిల్లాలో పలు రేడియోడయాగ్నస్టిక్స్ సెంటర్లలో యథేచ్ఛగా లింగనిర్ధారణ జరుగుతోంది. ఈ దురవస్థ వ్యాపారంగా సాగుతోంది. కొంతమంది గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు అత్యంత గోప్యంగా ఏజెంట్ల ద్వారా అబార్షన్లు నిర్వహిస్తున్నారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు డయాగ్నస్టిక్ సెంటర్లు, సంబంధిత డాక్టర్లపై చర్యలు తీసుకోలేకపోతున్నారు.

వారసుల కోసం ఆరాటం..

ఆస్తిపాస్తులు లేకపోయినా చాలా కుటుంబాల్లో 'మగపిల్లాడు ఉండాలి.. వారసుడు అంటే మగపిల్లవాడే' అన్న మూఢ విశ్వాసంతో ఉన్నారు. మహిళ గర్భం దాల్చిందని తెలియగానే ముందుగా ఆడపిల్లా, మగపిల్లాడా అని తెలుసుకునేందుకు రకరకాల మార్గాలు ఎంచుకుంటున్నారు. తొలికాన్పులో ఆడపిల్ల పుట్టిన వారు రెండో కాన్పులోనైనా మగ పిల్లవాడి కోసం ఇలా చేయడం పరిపాటిగా మారింది. ఇలాంటి నమ్మకాల వల్ల కూడా ఆడపిల్లల సంఖ్య తగ్గుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు అమ్మాయిలు లేక అబ్బాయిలకు 30 ఏళ్లు దాటినా పెళ్లిళ్లు కావడం లేదు.

అమ్మాయిల సంఖ్య తగ్గడానికి కారణాలివే..



- లింగనిర్ధారణ నిరోధక చట్టం సరిగా అమలు కాకపోవడం.
- డయాగ్నస్టిక్ సెంటర్ల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ సరిగా చేయకపోవడం.
- ఫిర్యాదులను పట్టించుకోకపోవడం.
- కేసులు నమోదవుతున్నా కఠిన చర్యలు తీసుకోకపోవడం.
- జిల్లా స్థాయి కమిటీల పర్యవేక్షణ లేకపోవడం.
- లింగనిర్ధారణ నిరోధక చట్టం అమలుకు నిధులు ఇవ్వకపోవడం.
- ఇచ్చిన నిధులు కూడా సరిగా వినియోగించకపోవడం.

క్లుప్తంగా

అవుట్ స్టాండింగ్ రైల్వే ఉమెన్ ఎంప్లాయీగా రజిత



అవార్డు అందుకుంటున్న రజిత

గుంతకల్లు: తిరుపతి డిపోలో టీటీఐగా పని చేస్తున్న ఎం.రజిత దక్షిణ మధ్య రైల్వే జోనల్ అవుట్ స్టాండింగ్ రైల్వే ఉమెన్ ఎంప్లాయీగా అవార్డు అందుకున్నట్లు సీనియర్ డీసీఎం మనోజ్ తెలిపారు. న్యూఢిల్లీలోని రైల్ నిలయంలో శనివారం రాత్రి రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ సెంట్రల్ ఆర్గనేజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైల్వే బోర్డు చైర్మన్, సీఈఓ సతీష్‌కుమార్ ఆమెకు అవార్డు అందించారన్నారు. గతేడాది డిసెంబర్ 22న తిరుపతి–చిత్తూరు (12697) వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఏ2 కోచ్‌లో బెర్త్ నం.3లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు దాదాపు రూ.రెండు లక్షలు విలువ చేసే బ్రాస్లెట్‌ను పోగొట్టుకున్నాడు. ఆ సమయంలో విధుల్లో ఉన్న టీటీఐ రజితకు దొరికిన బ్రాస్లెట్‌ను చిత్తూరు జీఆర్‌పీ పోలీసుల ద్వారా ప్రయాణికుడికి అందజేశారు. ఆమెను డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఆయన తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

గుంతకల్లు: రైళ్లలో ప్రయాణికుల నుంచి విలువైన వస్తువులు తస్కరిస్తున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు జీఆర్‌పీ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక జీఆర్‌పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌పీఎఫ్‌లతో కలిసి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండంగా ఏడో నంబర్ ప్లాట్‌ఫారామ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో ఒకరిని గుంటూరులోని సోమిరెడ్డి బజార్‌కు చెందిన హర్షవర్ధన్‌రెడ్డిగా గుర్తించామన్నారు. ఇతను ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణిస్తూ నిద్రపోతున్న ప్రయాణికులు బ్యాగులు, విలువైన వస్తువులు తస్కరిస్తున్నట్లు తెలిపారు. హర్షవర్ధన్‌పై గుంతకల్లు, గుంటూరు, గుత్తి, ఆదోని, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయన్నారు. ఇతని వద్ద నుంచి సుమారు రూ.79 వేలు విలువ చేసే ఓ బంగారు డాలరుతోపాటు వెండి పట్టీలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించామన్నారు. జీఆర్‌పీ ఎస్ఐ మహేంద్ర, ఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి ఉన్నా

- ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే 7 నెలల్లో 7,500 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం
- 50 వేల మంది మహిళల సొంతింటి కలను చిదిమేసిన పరిటాల సునీత
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడురూరల్: 'ఈ ఈవీఎంలతోనో, మరేదో కారణంగానో గెలిచారు. నన్ను ఆర్థికంగా, రాజకీయంగా అణచివేయాలనే దురాలోచనతో రాష్ట్రంలోని 50 వేలమంది మహిళల సొంతింటి కలను పరిటాల సునీత చిదిమేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆలమూరు, కొడిమి జగనన్న కాలనీల్లో 7,500 ఇళ్లను 7 నెలల్లో పూర్తి చేస్తా. ఇది నా ఛాలెంజ్' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సవాల్ విసిరారు. శనివారం నగర శివారులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిటాల సునీతకు అనంతపురం ఎమ్మెల్యే భయపడుతున్నారో లేదంటే ఇళ్ల నిర్మాణం బాధ్యతను వదులుకున్నారో తెలీదన్నారు. జన్మలో ఆమె కానీ, ఆమె భర్తకాని సొంత డబ్బుతో పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చారా?, పేదలకు రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టాలనే ప్రయత్నం చేశారా అని పరిటాల సునీతను ప్రశ్నించారు.

దప్పికయినప్పుడు బావి తవ్వాలనే విధానం

పేరూరు డ్యాంకు హంద్రీ–నీవా మడకశిర బ్రాంచ్ కెనాల్ నుంచి రొద్దం మండలంలోని పెన్నానది మీదుగా నీళ్లు తీసుకురావొచ్చని తాము చెప్పినా వినలేదన్నారు. దప్పికయినప్పుడు బావి తవ్వాలనే విధానంతోనే పరిటాల సునీత 2018లో జీడిపల్లి నుంచి పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చేందుకు కాలువ నిర్మాణానికి టెండర్లు పిలిపించి 2019లో పనులు ప్రారంభించారన్నారు. ముందుగానే కాంట్రాక్టర్ నుంచి కమీషన్లు దండుకున్నారన్నారు. ఒక రూపాయి కూడా నిధులు తేలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత వారికి సంబంధించిన కాంట్రాక్టర్‌కు రూ.170 కోట్ల నిధులు ఇప్పించి పనులు వేగవంతం చేయించామన్నారు. పూర్తిస్థాయిలో పనులు అవ్వాలంటే పదేళ్లు పడుతుందని భావించి అప్పటిదాకా ఈ ప్రాంత రైతులను ఎండబెట్టడం సరికాదని, అప్పటి సీఎం జగనన్నతో మాట్లాడి ప్రత్యేకంగా మడకశిర బ్రాంచ్ కెనాల్ నుంచి పేరూరు డ్యాంకు ఒక టీఎంసీ నీళ్లు తీసుకొచ్చేందుకు జీఓ తెచ్చామన్నారు. తర్వాత దాతలు, రైతుల సహకారంతో 45 కిలోమీటర్ల మేర కాలువ నిర్మించి డ్యాంకు నీళ్లు తీసుకొచ్చామని గుర్తు చేశారు.

కౌంటరు దాఖలు చేయని దద్దమ్మ ప్రభుత్వం

ఇళ్ల నిర్మాణాల నిలుపుదలపై రాక్రీట్ సంస్థ కోర్టుకు వెళ్తే...మీ చేతకాని చవట దద్దమ్మ ప్రభుత్వం ఇప్పటిదాకా కనీసం కౌంటర్ వేయలేదని ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే విజిలెన్స్ విచారణ ఏంటని, రాక్రీట్ సంస్థకు ఎందుకు బిల్లులు ఆపారని జడ్జిగారు ప్రశ్నిస్తే.... తమకు, ఆ సంస్థకు సంబంధం లేదని అడ్వొకేట్ జనరల్ చెప్పారని గుర్తు చేశారు. ఈ కేసు నుంచి ఏమీ సాధించలేమని భావించి కౌంటర్ వేయకుండా నిలిపేశారన్నారు. 9 నెలలుగా మీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, విజిలెన్స్ విచారణలన్నీ పూర్తి చేశారన్నారు. మళ్లీ ఈరోజు సునీత అసెంబ్లీలో రాక్రీట్ సంస్థ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పరిటాల సునీత తత్వం రైతులకు బోధపడింది

ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో పుష్కలంగా నీళ్లున్నాయని, చంద్రబాబుతో పరిటాల కుటుంబం సన్నిహితంగా ఉంటోందని, పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చేందుకు అవకాశాలున్నా పరిటాల సునీత ఏరోజూ చంద్రబాబుతోగాని, లోకేష్‌తో గాని మాట్లాడలేదన్నారు. తీరా మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీళ్లు వదిలే సమయంలో రిపేరీల పేరుతో డ్యాంకు ఉన్న గేట్లు తీయించారన్నారు. వచ్చే ఏడాది నీళ్లిస్తామంటూ కట్టుకథలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిటాల సునీత తనకు లాభం లేనిదే ఏపనీ చేయరనే తత్వం రైతులకు బోధపడిందన్నారు. ఇక కమీషన్ల కోసమే హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనుల కోసం కక్కుర్తి పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. పేరూరు డ్యాం, చెరువులను ఎండబెట్టి మీ జేబులను మాత్రం కమీషన్లతో నింపుకుంటారా?అని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు న్యాయవాది కురుబ నాగిరెడ్డి, ఆత్మకూరు మండల కన్వీనర్ బాలపోతన్న, పార్టీ నాయకులు నీరుగంటి నారాయణరెడ్డి, మాదన్న, ఈశ్వరయ్య, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: సమాజంలో మహిళల పాత్ర కీలకమని ఎస్పీ పి. జగదీష్ అన్నారు. పోలీసు కాన్ఫరెన్స్ హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ మహిళలు అభివృద్ధి సాధించారన్నారు. ఏ పోటీ పరీక్షల్లోనైనా మహిళల ప్రతిభ చాటుతున్నారు. పోలీసు శాఖలో మహిళా సిబ్బంది పాత్ర ప్రశంసనీయమన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ హెల్ప్ డెస్క్ నిర్వహిస్తున్నామన్నారు. మహిళా సాధికారిత వారోత్సవాల్లో నిర్వహించిన జరిపిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులకు ఎస్పీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అంతకు ముందు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆర్అండ్‌బీ అతిథి గృహం, అంబేద్కర్ కూడలి, వై.జంక్షన్‌ల మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, అనంతపురం మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎస్. మహబూబ్ బాషా, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాసరావు, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల నియామకం



ఆర్.కృష్ణవేణి

అనంతపురం కార్పొరేషన్: క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో కొన్ని నియామకాలు చేపట్టింది. ఇందులో భాగంగా మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పేరం స్వర్ణలత, అధికార ప్రతినిధిగా ఆర్.కృష్ణవేణి, రాష్ట్ర కార్యదర్శులుగా భూమిరెడ్డి జాహ్నవి, బోయ సుశీలమ్మ, కేఎల్ దేవి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పాటిల్ రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా నూకల పట్టాభి రామసుబ్బయ్య గుప్తా, రాష్ట్ర ఇంటిలెక్చువల్ ఫోరం ప్రధాన కార్యదర్శిగా బాణ రాఘవేంద్ర, అధికార ప్రతినిధిగా డాక్టర్ పి.శంకరయ్య, కార్యదర్శిగా కట్టుబడి తానీష నియమితులయ్యారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు



ముద్దలాపురంలో రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్, తదితరులు

కూడేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని ఏమాత్రం విస్మరించాయని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రైతు సంఘం రాష్ట్ర నేత రాంభూపాల్ ధ్వజమెత్తారు. రైతు సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం ముద్దలాపురం చేరుకుంది. పాదయాత్రకు డాక్టర్ గేయానంద్, రాంభూపాల్ సంఘీభావం తెలిపారు. ముద్దలాపురంలో బ్యాడిగి మిర్చి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తెగుళ్లతో పంట దిగుబడి బాగా తగ్గిపోయిందని, మార్కెట్లో గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్ట పోయామని రైతులు వాపోయారు. అనంతరం డాక్టర్ గేయానంద్, రాంభూపాల్ మాట్లాడారు. పంటల సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాక అప్పులతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, 2024–25 ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారాంరెడ్డి, సహాయ కార్యదర్శి నాగేంద్ర కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గుత్తి రూరల్: శ్రీపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారి పక్కన శనివారం బి.రవి(38) అనే భవన నిర్మాణ కార్మికుడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీపురం గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి ప్యాంటు జేబులో ఉన్న ఓటరు కార్డును స్వాధీనం చేసుకున్న పోలీసులు మృతుడు గుంతకల్లు ఉమామహేశ్వరనగర్‌కు చెందిన రవిగా గుర్తించారు. కుటుంబ సభ్యులను ఆరా తీయగా శుక్రవారం రాత్రి 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపారు. బేల్దారు పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడని, గుత్తి బండగేరికి చెందిన మణి అనే యువతిని వివాహం చేసుకున్నట్లు చెబుతున్నారు. ఐదు నెలల క్రితం భార్య తమకు చెప్పకుండా భర్త, పిల్లలను వదిలి పుట్టింటికి వెళ్లిపోయినట్లు తెలిపారు. మృతుడికి కుమార్తె గౌతమి, కుమారుడు గోవర్ధన్ ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రవిది హత్యా లేక రోడ్డు ప్రమాదమా?

శ్రీపురం గ్రామ శివారులో రవి మృతి హత్యనా లేక రోడ్డు ప్రమాదమా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఘటన స్థలంలోని ఆనవాళ్లు అనుమానాలకు తావిస్తున్నాయి. మృతదేహం పక్కన పెనుగులాట జరిగినట్లు పాదముద్రలు ఉన్నాయి. రవిని ఇద్దరు లేదా ముగ్గురు హత్య చేసి రోడ్డుపై నుంచి లాక్కొచ్చినట్లు జాడలు ఉన్నాయి. తల, భుజం, ఛాతీపై రక్త గాయాలున్నాయి. సంఘటనా స్థలానికి కొద్ది దూరంలో భవన నిర్మాణ పనులకు ఉపయోగించే తాపీ పడి ఉంది. కుటుంబసభ్యులు సైతం రవి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మాత్రం రవి బైక్‌పై గుత్తి వైపునకు వేగంగా వస్తూ బైక్ నుంచి రోడ్డుపై పడి తీవ్ర గాయాలతో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీఐ వెంకటేశ్వర్లును సంప్రదించగా రవి మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సెంట్రల్ వర్సిటీకి రెండు పరిశోధన ప్రాజెక్టులు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీకి ఐసీఎస్ఎస్ఆర్ (భారత సామాజిక శాస్త్ర పరిశోధన మండలి) రెండు పరిశోధన ప్రాజెక్టులు మంజూరు చేసింది. చిరుధాన్యాల ఉత్పత్తి ద్వారా స్థిరమైన గ్రామీణాభివృద్ధి– రాయలసీమ ప్రాంతంపై ప్రభావం అనే అంశంపై ఒక ప్రాజెక్ట్ మంజూరైంది. డాక్టర్ జి. మాలతి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్‌ను నిర్వహిస్తారు. అలాగే ఆంధ్ర మహాభారత ఉద్యోగ పర్వం– దౌత్య విధానం– సమకాలీన సమన్వయం అనే అంశంపై మరో ప్రాజెక్ట్ మంజూరైంది. ఈ ప్రాజెక్ట్‌కు గరికపాటి గురుజాడ ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్‌గా వ్యవహరిస్తారు. వర్సిటీకి తొలి పరిశోధన ప్రాజెక్ట్‌లు రావడం సంతోషదాయమకని వీసీ కోరి అభిప్రాయపడ్డారు.

రేపు ఉద్యోగ మేళా

అనంతపురం: ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లా రెడ్డి తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ ఫైనాన్స్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఇంటర్మీడియట్ పాస్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయి 20 నుంచి 30 ఏళ్లలోపున్న యువతీ, యువకులు అర్హులన్నారు. టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ఉద్యోగానికి ఎంపికైన వారు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని వివిధ మండలాల్లో ముత్తూట్ ఫైనాన్స్ , ఎల్అండ్‌టీ ఫైనాన్స్ సంస్థల బ్రాంచ్‌ల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో ఉదయం 10 గంటలకు ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటర్‌లో హాజరుకావాలని సూచించారు.

శతాధిక వృద్ధుడి మృతి



చిక్కన్న(ఫైల్)

కంబదూరు: జెక్కిరెడ్డిపల్లికి చెందిన శతాధిక వృద్ధుడు పెద్ద నాగప్ప గారి చిక్కన్న(101) మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం కాగా మనవళ్లు, మనరాళ్లు 15 మంది ఉన్నారు. చిక్కన్న మృతి పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు సంతాపం ప్రకటించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ



తెగిపడిన బంగారు గొలుసు

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును శనివారం గుర్తు తెలియని దొంగ అపహరించాడు. బాధితురాలి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి వేకువ జామున ఇంటి బయట పనిలో నిమగ్నమైంది. ఇంతలో ముసుగు ధరించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెపై ఒక్కసారిగా దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పరిగెత్తాడు. మహిళ బిగ్గరగా కేకలు వేయడంతో విషయం తెలుసుకున్న కొందరు గ్రామస్తులు దొంగను వెంబడించారు. అయితే దొంగ వారికి దొరకకుండా పారిపోయాడు. దొంగ మహిళ మెడలోని గొలుసును లాగిన సమయంలో సగం తెగిపోయి అక్కడే పడిపోగా సగం గొలుసును ఎత్తుకెళ్లాడు. పోలీసులు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చీనీతోట దగ్ధం



మంటల్లో కాలిపోయిన చీనీ చెట్లు

గార్లదిన్నె: పెనకచెర్లలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చీనీతోట దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అనిల్ 600, హరి 500 చీనీ చెట్లు సాగు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కోతకు వచ్చి, పండిన పంట మొత్తం చీనీ చెట్లు డ్రిప్పు వైర్లు, పైపులు మంటల్లో కాలిపోయాయి. ఘటనలో దాదాపు రూ.20 లక్షలు వాటిల్లిందని రైతులు తెలిపారు.

మర్తాడులో దానిమ్మ తోట దగ్ధం

మర్తాడులో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటల్లో దానిమ్మ తోట పూర్తిగా కాలిపోయింది. బాధిత రైతు రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. తన పొలంలో 800 దానిమ్మ చెట్లు సాగు చేశాడు. ప్రస్తుతం పంట పూత, కాయ దశలో ఉందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు కంచెకు నిప్పు పెట్టడంతో మంటలు దానిమ్మ తోటకు వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. ఘటనలో రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

సీనియార్టీ జాబితాలో తప్పులు సరిచేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: భాషోపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో పొరబాట్లను సరి చేయాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు వై.ఆదిశేషయ్య, ప్రధానకార్యదర్శి జి.వేణుగోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా వారివారి వివరాలు టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో నమోదు చేసినప్పటికీ ప్రకటించిన జాబితాలో చాలా పొరబాట్లు జరిగాయన్నారు. ఎస్ఎల్‌టీఏ నాయకులు జూటూరు తులసీదాస్, సాయి ప్రసాద్, ఆపస్ రాష్ట్ర బాధ్యులు రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, వరదరాజులు ఉన్నారు.

గందరగోళంగా సీనియార్టీ జాబితా

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా గందరగోళంగా మారిందని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జల శివయ్య, డెగావత్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల ర్యాంకులు రోస్టర్ కం మెరిట్ లిస్టులు ప్రకటించకపోవడంతో సీనియారిటీ డ్రాఫ్ట్ జాబితాలో అనేక పొరపాట్లు దొర్లాయన్నారు. సీనియారిటీ డ్రాఫ్ట్ జాబితాలో ఉన్న తప్పులను సవరణకు ఉమ్మడి జిల్లాలో అందరి డీడీఓలకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలన్నారు. ఇటీవల ఇచ్చిన మునిసిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లలో 70 శాతం కోట పూర్తికాని కేటగిరీల్లో 70 శాతం ప్రమోషన్ కోటా భర్తీ చేసేందుకు కమిషనర్ నుంచి అనుమతులు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళా సాధికారతకు ఉపాధ్యాయినులే నిర్దేశకులు



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళా సాధికారతరకు ఉపాధ్యాయినులే దిశా నిర్దేశకులు అని సర్వశిక్ష అభియాన్ ఏపీసీ శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు గాయత్రి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఏపీసీ మాట్లాడుతూ మహిళా సాధికారత ఎంతో అవసరమన్నారు. ఇందుకు పాఠశాల స్థాయిలోనే పునాది పడాలని సూచించారు. బుక్కరాయసముద్రం ఎంపీపీ సునీత మాట్లాడుతూ మహిళలు తమ అవకాశాలు, హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సుజాత మాట్లాడుతూ మహిళలపై సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా చూపుతోందన్నారు. వివక్షత లేనటువంటి సమాజం నిర్మించాలన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి. నరసింహులు, రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్ సిరాజుద్దీన్, నాయకులు సర్దార్‌వలి, కే. వన్నప్ప, సతీష్ కుమార్, నరేష్ కుమార్, ఈజీ నాగభూషణం, నారాయణస్వామి సూర్యనారాయణ, పట్నం శ్రీనివాసులు, హరినాథ్, రామచంద్ర, తిప్పేస్వామి, సోహెల్ ఓబులేసు, సాయప్ప, ఎల్లప్ప, గంగాధర్, రామమూర్తి, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష



ఉట్టి ఉత్సవాన్ని తిలకిస్తున్న జనం(ఇన్‌సెట్‌లో) ఎర్రిస్వామి తాత

రాప్తాడు: అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత ఉట్లపరుషను శనివారం వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో వినాయకుడు, శ్రీరాముడు, ఎర్రిస్వామి తాత, గోటుకూరుప్ప స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం అయ్యవారిపల్లి, బోమ్మేపర్తి, బుక్కచెర్ల, కాటిగానికాలువ గ్రామాలకు చెందిన యాదవ కులస్తులు ఉట్టికొట్టారు. ఈ దృశ్యాన్ని వేలాది మంది తిలకించారు. ఆలయం వద్ద బుల్లే పెద్దఇటుకనల్లప్ప, బండి పెదయ్య, బుల్లే వెంకటరాముడు, బుల్లే రాంభూపాల్ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తాదులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కాల్వగొంచి నిర్వాహకులు, గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాప్తాడు సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'డాలీ' సేవలు ప్రశంసనీయం



జాగిలాన్ని సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ పి. జగదీష్

అనంతపురం: పోలీసు జాగిలం 'డాలీ' జిల్లా పోలీసు శాఖకు అందించిన సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ పి. జగదీష్ అన్నారు. గత 11 సంవత్సరాలుగా సేవలందించిన 'డాలీ' శనివారం విధుల నుంచి నిష్క్రమించింది. ఈ సందర్భంగా డాలీకి ఎస్పీ సన్మానం చేశారు. హ్యాండ్లర్ నాగభూషణను అభినందించారు. 2014 సంవత్సరంలో 6 నెలల వయస్సు ఉన్నపుడు డాలీని అనంతపురం జిల్లాకు కేటాయించారన్నారు. దాదాపు 300పైగా నేర ప్రదేశాల్లో శోధించిందన్నారు. సుమారు 30 నేరాల ఛేదనకు దోహదపడిందని వెల్లడించారు.

ముగిసిన హెచ్చెల్సీ కోటా

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం హెచ్చెల్సీ కోటా శనివారంతో పూర్తయింది. దీంతో నీటిని నిలుపుదల చేశారు. అదనపు జలాలతో కలిపి మొత్తం 33.931 టీఎంసీలు ఈ ఏడాది హెచ్చెల్సీకి విడుదలయ్యాయి. తొలుత దామాషా ప్రకారం కేవలం 26 టీఎంసీలు కేటాయించారు. వర్షాలు కురిసి జలాశయం నిండడంతో హెచ్చెల్సీ కోటా 30.881 టీఎంసీలు, కేసీ కెనాల్ కోటా 3.50 టీఎంసీలు మొత్తం 33.931 టీఎంసీలు విడుదల చేశారు. ఈ క్రమంలో 90,355 ఎకరాలకు సాగునీటిని అందించారు. వాస్తవంగా గత నెలలోనే కోటా పూర్తి కాగా గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద పంటలు చివరి దశలో ఉండడంతో అదనంగా 0.5 టీఎంసీలను కేటాయించారు. ప్రస్తుతం కణేకల్లు చెరువులో 0.227 టీఎంసీలు, పీఏబీఆర్‌లో 3.029 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 0.835 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పీఏబీఆర్ నీటిని రానున్న వేసవిలో తాగునీటి అవసరాలకు వాడుకోనున్నారు. ఎంపీఆర్‌లో నిల్వ ఉన్న నీటిని సౌత్ కెనాల్, నార్త్ కెనాల్స్‌కు వరుసగా 200 క్యూసెక్కులు, 90 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. ఈ విషయంపై 'సాక్షి'తో హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం నుంచి ఆశించిన స్థాయిలో నీళ్లు విడుదలయ్యాయన్నారు. అదనపు కోటా కలిపి 33.931 టీఎంసీలు విడుదల కావడంతో దాదాపు లక్ష ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగు నీరు విడుదల చేశామన్నారు.

క్లుప్తంగా

గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణం పకడ్బందీగా చేపట్టాలి

● కంపెనీ ప్రతినిధులకు కలెక్టర్ ఆదేశం



అరవిందనగర్‌లో గ్యాస్ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఇంటింటికీ వంటగ్యాస్ అందించేందుకు చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ పనులు అత్యంత పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం నగరంలోని అరవిందనగర్‌లో ఏజీ అండ్‌పీ కంపెనీ చేస్తున్న ఇంటింటికీ వంట గ్యాస్ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఎన్ని కిలోమీటర్లు పైప్‌లైన్ వేస్తున్నారు? ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు? ఇంటింటికీ కనెక్షన్లు ఎలా ఇస్తారు.. తదితర వివరాలను కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

నేడు హ్యాపీ స్ట్రీట్

అనంతపురం: ఆర్డీటీ, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ,అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా నగరంలో తొలిసారిగా 'హ్యాపీ స్ట్రీట్' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. మహిళలు అన్ని రంగాల్లో పురోగతి, క్రీడల్లో విజయాలను అందించేలా ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమం జరుగుతుంది. క్రీడలు, కళలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.


ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

అనంతపురం ఎడ్యుకేషన్:ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శనివారం కలెక్టర్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు గణితం పేపర్-1బీ, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్-1 పరీక్షలు జరిగాయి. నగరంలోని శ్రీ సత్యసాయి బాలికల జూనియర్ కళాశాల కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. వసతులపై ఆరా తీశారు. పరీక్షలు సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. చివరి పరీక్ష వరకు వసతుల్లో లోటుపాట్లు ఉండకూడదని ఆదేశించారు.కాగా జనరల్ విద్యార్థులు 20,313 మందికి గాను 19,829 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,438 మందికి గాను, 2,301 మంది హాజరయ్యారు. చిట్టీలు దొరకడంతో అనంతపురంలో ఇద్దరు విద్యార్థులను మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేశారు. పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎం.వెంకటరమణ నాయక్, 04, కమిటీ సభ్యులు 04, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 14, కస్టోడియన్లు 13 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఔషధ మొక్కల పంపిణీ

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీనివాస నగర్ శ్రీసీతారామాంజనేయ దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం వందలాది తులసి, ఇతర ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము, కమిటీ సభ్యులు రామ ప్రసాద్, రామ్మూర్తి, మహేంద్ర, అనిల్ ప్రసాద్, టౌన్‌బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, డాక్టర్ తిరుపాల్‌నాయుడు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

'నవభారత్'లో సరస్వతీ పూజ



పాఠశాల యాజమాన్యంతో పదో తరగతి విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆజాద్ నగర్‌లోని నవ భారత్ పాఠశాలలో శనివారం సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. చివరగా పదోతరగతి విద్యార్థులకు తక్కిన తరగతుల విద్యార్థులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్. కృష్ణవేణి, ఎస్. అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఈద్గా మైదానంలో శనివారం జరిగిన ఇఫ్తార్ విందులో నగర మేయర్ వసీం సలీం ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక దువా ఆచరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రతి పుణ్యకార్యం జన్మజన్మల ఫలితం ఇస్తుందన్నారు. మసీదు నిర్వాహకులు మాట్లాడుతూ హోదాలు మరచి సామాన్యులతో కలిసి మేయర్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నగరంలో పలు చోట్ల శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. మహిళల సేవలను వక్తలు కొనియాడారు. మరింతగా రాణించాలని పిలుపునిచ్చారు.



అనంతపురం సర్వజనాస్పత్రిలో మహిళలను సన్మానించిన దృశ్యం



రాప్తాడు: మానవహారం ఏర్పాటు చేసిన ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది

మహిళలు శక్తిస్వరూపిణులు

అనంతపురం అర్బన్: మహిళలు శక్తిస్వరూపిణులని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతిప్రసాద్, పద్మావతి అన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు విశేష ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారన్నారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య సీనియర్ నాయకురాలు, మాజీ కార్యదర్శి లక్ష్మీదేవి సమాఖ్య పతకాన్ని ఆవిష్కరించి వేడుక జరుపుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. హక్కుల సాధనకు మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షురాలు జానకి, నాయకురాళ్లు లక్ష్మీదేవి, యశోద, కమ్మక్క, సునీత, బేగం, రాణి, సుజాత, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో..

అనంతపురం ఎడ్యుకేషన్:రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో సామాజిక కార్యకర్త అనూరాధ మాట్లాడుతూ మహిళా సాధికారత, సమాజంలో మహిళల ప్రాధాన్యత, జెండర్ తేడా లేకుండా ఉండాలని వివరించారు. లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళలు ఎంతో ఎదిగారన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ పురుషాధిక్యంలో మహిళలు ఇంకా ఎదగాలని కోరారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి పద్మ మాట్లాడుతూ మహిళ లేనిదే సమాజం లేదన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను, సామాజిక కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. రమణా రెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి. సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్ శివయ్య ఆచారి, నాయకులు మురళీ, ఫణి భూషణ్, రాజశేఖర్, మల్లికార్జున, గంగాధర్ పాల్గొన్నారు.

మహిళలకు ఎవరూ సాటిరారు..

అనంతపురం కల్చరల్:'మహిళలకు ఎవరూ సరిరారు' అంటూ వక్తలు కొనియాడారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని శనివారం స్థానిక అర్బన్‌బ్యాంకు సెమినార్ హాలులో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా ప్రతినిధి లక్ష్మి నేతృత్వంలో ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, కవయిత్రి అనంత మాలతి,నిత్యసురభిట్రస్టు డాక్టర్ నిర్మల,ఐద్వా సావిత్రి, గాయనీమణులు శ్రీదేవి, పద్మజ, సీనియర్ న్యాయవాది నాగేశ్వరి, ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత షమీమ్, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షురాలు నిర్మలాదేవి తదితరులను ఘనంగా సత్కరించారు. మహిళల ఔన్నత్యాన్ని గురించి అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, ఘంటసాల ఆరాధన సమితి నిర్వాహకులు పాలసముద్రం నాగరాజు, రామయ్య, సుగమంచి సురేష్ తదితరులు మాట్లాడారు. సంస్కార భారతి సమాజం గర్వపడే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సాయి ట్రస్టు వారు మహిళలందరికీ అన్నవసతి కల్పించారు.

- రెయిన్‌బో అనాథాశ్రమంలో మహిళాదినోత్సవం సందడిగా సాగింది. మానవతా కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి, కథా రచయిత్రి శశికళ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, సీఆర్‌డీఎస్ డైరెక్టర్ సద్దాం హుస్సేన్, అడ్వకేట్ దయానంద తదితరులు మాట్లాడుతూ మిగతా రోజుల్లోనూ మహిళలను గౌరవించాలని సూచించారు. స్వయం ఉపాధి శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందించారు.

నెహ్రూ యువకేంద్రలో..

మహిళలు అన్ని రంగాల్లోనూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని నెహ్రూ యువకేంద్రం అధికారులు కొనియాడారు. శనివారం స్థానిక ఎన్‌వైకే కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందడిగా జరిగింది. జనశిక్షణ సంస్థ డైరెక్టర్ సౌదాగర్, నెహ్రూ యువకేంద్ర డీడీఓ శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాతి భరత్, జీవన్‌కుమార్, సెంట్రల్ యూనివర్సిటీ డాక్టర్ ప్రణతి తదితరులు మాట్లాడారు. దేశం వికసిత భారత్ కావాలంటే మహిళలే ముందంజలో ఉండాలన్నారు. అనంతరం స్ఫూర్తిదాయక మహిళలను ఘనంగా సత్కరించారు.

- అనంతపురం క్లబ్ ప్రాంగణంలో ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్షుడు సుగుమంచి సురేష్ నేతృత్వంలో పెద్ద ఎత్తున మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. పలువురు మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆటపాటలతో మహిళలు హోరెత్తించారు.

ప్రపంచానికే మార్గదర్శకం

అనంతపురం మెడికల్: మహిళా శక్తి ప్రపంచానికే మార్గదర్శకమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు అభిప్రాయపడ్డారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సెక్యూరిటీ, ఎఫ్ఎన్ఓ, కార్యాలయ సిబ్బందిని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో మహిళలు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. సిబ్బంది సన్మాన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం రావాలి

రాప్తాడు: గ్రామీణ మహిళల్లో మరింత చైతన్యం వచ్చినపుడే సమాజంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారని ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం రాప్తాడులోని చర్చిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది, మహిళా రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి మహిళల ఐక్యత వర్ధిల్లాలి, మహిళలపై దౌర్జనాలు, గృహహింస అరికట్టాలి, వరకట్న చావులు ఆపాలి, ఆడపిల్ల చదువు అవనికి వెలుగు అంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి, నాబార్డ్ డీజీఎం అనురాధ, రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. వరకట్నాలు, బాల్యవివాహాలు తదితర సాంఘిక దురాచారాలకు ఎంతో మంది మహిళలు బలయ్యారని తెలిపారు. స్త్రీలు తమ హక్కులను, బాధ్యతలను తెలుసుకున్నప్పుడే భవిష్యత్తులో తమ పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుందన్నారు. కుటుంబంలో మహిళలు ప్రముఖ పాత్ర పోషిస్తారన్నారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. అదేవిధంగా హంపాపురం సమీపంలో ఉన్న ఎస్‌వీఐటీ కళాశాలలో కూడా మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఎకాలజీ ఎఎల్‌పీ కోఆర్డినేటర్ రిజ్వానా, ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ శంకర్ నాయక్, సీవీఆర్‌డీపీ హనుమంతరాయుడు, ఎంఐఎస్ శాలిని, ఎంటీఎల్ ఇంద్రజ, ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళలు



మహిళా సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



నెహ్రూ యువ కేంద్రలో వేడుకలు



సంధ్యామూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

హోరాహోరీగా రాతి దూలం లాగుడు పోటీలు

రాప్తాడు: అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత ఉట్ల పరుష సందర్భంగా శనివారం ఉదయం ఆలయం దగ్గర కాల్వగొంచి నిర్వాహకులు, గ్రామ ప్రజలు నిర్వహించిన జిల్లాస్థాయి రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 4 జతల దేశీయ ఎద్దులు (వృషభాలు) పాల్గొన్నాయి. ఒక్కో జతకు 20 నిమిషాల సమయం కేటాయించారు. పోటీల్లో ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన కె.చెన్నప్ప వృషభాలు ప్రథమ, శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మద్దెలచెరువుకు చెందిన మూలింటి కొండయ్య వృషభాలు ద్వితీయ, కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ఆనంద్‌రెడ్డి వృషభాలు తృతీయ, చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెల పూజారి తిప్పన్న వృషభాలు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యాజమానులకు ప్రథమ బహుమతి (రూ.25 వేలు) బుల్లే పెద్ద ఇటికనల్లప్ప కుమారులు, ద్వితీయ బహుమతి (రూ.20 వేలు) వెన్నపూస సూర్యచంద్రారెడ్డి, తృతీయ బహుమతి (రూ.15 వేలు) కపాడం పవన్ సందీప్, నాలుగో బహుమతి (రూ.10 వేలు) పిట్టా ఆదినారాయణ పంపిణీ చేశారు. సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



ప్రథమ స్థానంలో నిలిచిన తోపుదుర్తి చెన్నప్ప వృషభాలు

రోగులకు నాణ్యమైన సేవలు అందిద్దాం

అనంతపురం మెడికల్: రోగులకందించే సేవల్లో పోటీపడుతూ ప్రభుత్వ సర్వజనాస్పత్రికి మరింత మంచి పేరు తీసుకువద్దామని గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి పిలుపునిచ్చారు. శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని లెక్చరర్స్ గ్యాలరీలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు సేవలందించిన స్టాఫ్‌నర్సులు, పర్యవేక్షించిన కొందరు హెడ్‌నర్సులను గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ అభినందించారు. సర్వజనాస్పత్రిలో రోగులకందించే సేవల్లో స్టాఫ్‌నర్సులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. రోగులు, వారి సహాయకులతో మంచిగా మాట్లాడాలన్నారు. ఏమైనా సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజినిలు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ కేక్ కట్ చేసి స్టాఫ్‌నర్సులకు అందించారు. కార్యక్రమంలో హెడ్ నర్సులు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న స్టాఫ్‌నర్సులు

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు'

అనంతపురం టవర్‌క్లాక్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చరాదని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి చక్రి నాయక్ అన్నారు. శనివారం స్థానిక బంజార కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రి నాయక్ మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన బంజారా, ఎరుకల, యానాదులకు అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిని ఎన్నికల్లో ఓడించామన్నారు. ఢిల్లీలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలజీ నాయక్, కిరణ్ నాయక్, గోపాల్ నాయక్, సుగుణ బాయి,శివ మణి బాయి, చంద్రి బాయి, రామాంజినేయులు నాయక్, ఈశ్వరి బాయి, చంద్రకళ బాయి, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమించాలి

అనంతపురం టవర్‌క్లాక్: మహిళలు హక్కుల కోసం ఐక్యతతో ఉద్యమించాలని స్త్రీ విముక్తి సంఘటన జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మీ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ మాట్లాడుతూ రోజురోజుకూ మహిళల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ప్రత్యేక చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సూర్య సాగర్, మల్లీశ్వరి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

బరి తెగించిన దొంగలు



షట్టరు పగలగొట్టేందుకు పరిశీలిస్తున్న దొంగలు



పాన్ సెంటరులో సంచుల్లోకి సామగ్రిని సర్దుతున్న దొంగలు

● నగర శివారు కాలనీల్లో పేట్రేగిపోతున్న వైనం

రాప్తాడురూరల్:అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి, కొడిమి ప్రాంతాల్లో ఇటీవల వరుస దొంగతనాలతో ప్రజలు కలవరపడుతున్నారు. దొంగలు బరి తెగించి దొంగతనాలకు పాల్పడుతుండడంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఇటీవల రాచానపల్లి, కొడిమి పంచాయతీల్లో పలు ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలను అపహరించారు. రామకృష్ణపురంలో ఓ ఇంట్లో రాత్రి గ్యాస్ సిలిండర్‌ను ఎత్తుకెళ్తున్న దొంగను పట్టుకున్న స్థానికులు పోలీసులకు అప్పగించారు. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిలోని రాచానపల్లి వద్ద వరుసగా మూడు దుకాణాల్లో ఇద్దరు దొంగలు హల్‌చల్ చేశారు. సర్దార్ అనే వ్యక్తి 'దిల్ పాన్ సెంటర్', పక్కనే ప్రవీణ్ అనే యువకుడి టీషర్టుల దుకాణం, మరో పక్క పచ్చి టెంకాయల అంగడి ఉన్నాయి. ఈ మూడు షాపులను లక్ష్యంగా చేసుకున్న ఇద్దరు దొంగలు షట్టర్లకు వేసిన తాళాలు పగలకొట్టి లోపలికి ప్రవేశించారు. పాన్‌సెంటర్‌లో సుమారు రూ.20 వేల విలువ చేసే సిగరెట్లు, కొంత నగదు, రూ.15 వేలు విలువ చేసే ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. వస్తువులన్నీ బ్యాగుల్లో నింపుకునే దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఒక కెమెరాను గుర్తించిన దొంగలు దాన్ని ధ్వంసం చేసినప్పటికీ..మిగిలిన వాటిలో వారి వ్యవహారమంతా రికార్డయింది. బాధితుడు సర్దార్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీషర్టుల దుకాణం, పచ్చిటెంకాయల అంగడిలో డబ్బులు లేకపోవడంతో వస్తువులేవీ ముట్టుకోకుండానే దొంగలు వెనుదిరిగారు. రాచానపల్లి దాటే వరకు రహదారి మధ్యలో బటర్‌ఫ్లై లైట్లు వెలుగుతున్నాయి. తరచూ వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. అయినా ధైర్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారంటే పోలీసుల గస్తీపై అనుమానాలు కలుగుతున్నాయి. కాగా.. దొంగతనానికి పాల్పడిన ఇద్దరూ యువకులే. 20-22 ఏళ్లలోపు ఉంటాయి. ఇప్పటికైనా రూరల్ పోలీసులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

11న ధర్నా

అనంతపురం అర్బన్: గొర్రెలు, మేకలు అభివృద్ధి, పెంపకందారుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.2,500 కోట్లు కేటాయించాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఈనెల 11న గుంటూరులోని గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ ఎదుట ధర్నా తలపెట్టామన్నారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో ధర్నా పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా లింగమయ్యతో పాటు గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతులయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నాగప్ప, హరికృష్ణ, రాజే ష్ గౌడ్, రఘు, గోవిందరాజులు, ఆదినారాయణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు పెంచాలి

రాప్తాడు: పంచాయతీ కార్మికుల జీతాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. కార్మికుల జీతాల పెంపు కోసం ఈ నెల 17న నిర్వహించతలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం రాప్తాడులో చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ నిధులతో సంబంధం లేకుండా ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. సర్వీసును బట్టి కార్మికులను రెగ్యులర్ చేయాలని, అక్రమంగా తొలగించిన వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'జోర్డాన్'లో అంబరాన్నంటిన సంబరం



డ్యాన్సు చేస్తున్న విద్యార్థినులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ పరిధిలోని సీఎస్‌పురంలో ఉన్న జోర్డాన్ పాఠశాలలో శనివారం వార్షికోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. కరస్పాండెంట్ విక్టర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ గేమ్స్, సోషల్ మీడియా తదితర వాటికి బానిసలై సమయం వృథా చేసుకోకుండా ఉన్నతమైన లక్ష్యంతో ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు హుషారెత్తించే వివిధ పాటలకు డ్యాన్సులతో అలరించారు. వివిధ రకాల స్కిట్లతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు, శ్రీ సత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి పి.జయకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం అనంతపురం డీఈఓ ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యం, వయోభారంతో బాధ పడుతున్న ఉపాధ్యాయులకు పది జవాబు పత్రాల మూల్యాంకనం విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఇటీవల విద్యాశాఖ విడుదల చేసిన సబ్జెక్టు సీనియారిటీ జాబితాల్లో ఉన్న తప్పిదాలు సవరించాలన్నారు. ఎస్టీఏ నాయకులు శంకర్ నాయక్ , వేణుగోపాల్ పాల్గొన్నారు.

మార్కెటింగ్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



కార్యక్రమానికి హాజరైన హిమాలయన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వేణుగోపాల్ రావు

అనంతపురం: మార్కెటింగ్ నైపుణ్యాలపై పట్టు సాధిస్తే ఎంబీఏ పూర్తి చేసిన వారికి అపార అవకాశాలు దక్కుతాయని హిమాలయన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.వేణుగోపాల్ రావు అన్నారు. నగర శివారులోని అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు బ్రాండ్ ప్రమోషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, పరిశ్రమల్లోని నిపుణులు, వివిధ కళాశాలల విద్యార్థులను అనుసంధానం చేస్తూ ఒక వేదికను రూపొందించామని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.